

కావలిలో జరిగిన బహిరంగ సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

టిడిపి నేతల నిర్వహణ లోపమే కారణం..!

కందుకూరు ప్రమాదం..గుణపాఠం - విచారణకు పోలీసు ఉన్నతాధికారుల ఆదేశం

కందుకూరుపట్టణంలో చంద్రబాబు బహిరంగ సభలో చోటుచేసుకున్న సంఘటన రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసింది. టిడిపి నేతల నిర్లక్ష్యపు నిర్వహణే ఇందుకు ప్రధాన కారణంగా తెలుస్తుంది. 2024 ఎన్నికల్లో టికెట్లు ఆశిస్తున్న వ్యక్తులు భారీగా జనసమీకరణ చేస్తున్నారు. అందులో భాగంగానే కందుకూరు పట్టణంలో బుధవారం చోటుచేసుకున్న సంఘటన. ఇరుకైన ప్రాంతంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి భారీగా జనసమీకరణ చేయడంతో ఈ సంఘటన జరిగిందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఈ సంఘటనపై విచారణ జరుపుతున్నట్లు బాధితులపై కేసులు నమోదు చేయనున్నట్లు గుంటూరు డిఐజి త్రివిక్రమ్ వర్మ ప్రకటించారు. మరో వైపు ఈ పాప పరిహారంగా టిడిపి నేతలు మృతుల కుటుంబాలకు భారీ సాయాన్ని ప్రకటిస్తున్నారు. గురువారం సాయంత్రానికి టిడిపి, నేతలు ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల పరిహారం ప్రకటించారు.

మృతదేహాలకు నివాళి అర్పిస్తున్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

కందుకూరు పట్టణంలో చంద్రబాబు సభలో చోటుచేసుకున్న పరిణామాలు ప్రజల్లో ఆందోళన నెలకొంది.ఎన్నికల సీజన్ కావడంతో రాజకీయ పార్టీ నేతలు భారీగా జనసమీకరణ చేస్తున్నారు. కూలి పనులు చేసుకున్న నిరుపేదలకు డబ్బు ఆశ చూపి ఆటోలు, లారీలు, బస్సుల్లో తరలిస్తున్నారు. కందుకూరు నియోజకవర్గంలో రియల్ ఎస్టేట్ రంగంలో ఉన్న ఇంటూరునాగేశ్వరరావు, ఇంటూరు రాజేష్‌లు టికెట్ ఆశిస్తున్నారు. చంద్రబాబు దృష్టిలో పడడానికి బుధవారం భారీ జనసమీకరణ చేశారు. సింగరాయ కొండనుంచి స్వాగతం పలికి కందుకూరు వరకు 20కిలోమీటర్లు ఫ్లెక్సీలతో నింపారు. ఇందు కోసం ఇంటూరు రాజేష్ రూ.30లక్షలు ఖర్చు అయినట్లు తెలిసింది. జనసమీకరణ కందుకూరులో రోడ్ షో కోసం ఇంటూరు నాగేశ్వరరావు భారీగా ఖర్చు చేసినట్లు సమాచారం. ఇద్దరు బంధువులైనప్పటికీ రాజకీయంగా విభేదాలున్నాయి. అధినేత ముందు తమ సత్తా చాటుకునేందుకు ఒకరిని మించి ఒకరు జనసమీకరణ చేశారు. కందుకూరు పట్టణంలోని ఎన్‌టిఆర్ సర్కిల్ వద్ద గతంలో అనేక సభలు జరిగాయి. స్థానిక నేతలు గతంలో జరిగిన సభలకన్నా భిన్నంగా చేశారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి ముందు చంద్రబాబు చైతన్య రథం నిలబెట్టి రెండు వైపుల ఫ్లెక్సీలతో నింపారు. చిన్న స్థలం కావడం రోడ్‌షోకి వచ్చిన జనమంతా బహిరంగ సభ వద్దకు రావడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. చంద్రబాబు చైతన్యరథం కూడా ముందుకు వెనక్కి వెళుతుండ డంతో ఒక్కసారిగా తొక్కిసలాట జరిగింది. ఏం జరుగుతుందో తెలుసుకున్నలోపే ఒకరిపై ఒకరు పడ్డారు. దీంతో పెద్ద ప్రమాదం చోటుచేసుకుంది. స్పందించిన చంద్రబాబు ఆస్పత్రిలో చేర్పించడం, చికిత్స చేయించడం, ఆర్థిక సాయం చేయడం వాటి విషయాలను అటుంచితే స్థానిక నేతల అత్యుత్సాహం, నిర్వహణ లోపం, ఈప్రమాదానికి కారణంగా తెలుస్తున్నాయి. ఈ సంఘటనతో గురువారం సాయంత్రం కావలిలో జరిగిన రోడ్‌షో బహిరంగ సభకు పోలీసులు భారీ భద్రత ఏర్పాట్లు చేశారు. మృతుల కుటుంబాలకు టిడిపి, ఆ పార్టీ ముఖ్య నాయకులు భారీగా ఆర్థికసాయం ప్రకటించారు. సభ రద్దు కావడంతో స్థానిక టిడిపి నాయకులు డీలాపడ్డారు.

కందుకూరు సంఘటనపై విచారణ : డిఐజి

కందుకూరు పట్టణంలో చంద్రబాబు సభలో జరిగిన తొక్కిసలాట సంఘటనపై ఉన్నత స్థాయి పోలీసు అధికారులతో విచారణ జరుపు తున్నట్లు గుంటూరు డిఐజి త్రివిక్ర వర్మ తెలిపారు. గురువారం ఆయన నెల్లూరులో మీడియాతో మాట్లా డారు. కందుకూరు సంఘటన దురదృష్ట కరమైందని, సభ నిర్వహణలో లోపాలున్నాయని తెలిపారు. చిన్న స్థలంలో బహిరంగ సభ ఏర్పాటు చేసి భారీగా జనస మీకరణ చేయడంతో ఈసంఘటన చోటు చేసుకుందన్నారు. దీనికి సంబంధించి ఉన్నతస్థాయి పోలీసు అధికారిచే విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. బాధ్యులపై కేసు నమోదు చేస్తామని ప్రకటించారు.

కందుకూరులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న డిఐజి, ఎస్‌పి

ఒక్కో కుటుంబానికి రూ. 25లక్షలు సాయం

-టిడిపి తరపున రూ.15లక్షలు అందజేత

-మృతుల కుటుంబాలను పరామర్శించిన చంద్రబాబు

ప్రజాశక్తి- కందుకూరు : కందుకూరు పట్టణంలో చోటుచేసుకున్న సంఘటనలో మృతిచెందిన కుటుంబ సభ్యులకు టిడిపి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, టిడిపి నాయకులు ఒక్కొక్క కుటుంబానికి రూ.25లక్షలు సాయం ప్రకటించారు. గురువారం టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబునాయుడు మృతిచెందిన 8కుటుంబాలను నేరుగా వెళ్లి పరామర్శించారు. బుధవారం రాత్రి మృతిచెందిన కుటుంబాలకు టిడిపి తరపున రూ.10లక్షలు పరిహారం ప్రకటించారు. గురు వారం ఉదయం మరో రూ. 5లక్షలు పెంచి ఒక్కో కుటుం బానికి రూ.15లక్షలు పరిహారం ప్రకటించారు. ఆయన బస చేసిన కల్యాణ మండపం నుంచి ఒగూరు, కందుకూరు, ఉలవపాడు, తదితర గ్రామాల్లో మృతి చెందిన 8కుటుంబాల ఇళ్లకు చంద్రబాబు వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఒగూరు గ్రామానికి చెందిన ఆయన గడ్డం మధు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.15లక్షల చెక్కును అందజేశారు. వరుసగా ఉదయం నుంచి సాయంత్రం వరకూ మృతుల కుటుంబాల వద్దకెళ్లి పరామర్శిం చారు. పరిహారం ప్రకటించిన వారిలో టిడిపి రూ.15లక్షలు, ఇంటూరు నాగేశ్వరరావు లక్షరూపాయలు, ఇంటూరు రాజేష్ లక్ష రూపాయలు, ఎస్ లోహిత లక్ష రూపాయలు, బేబి నాయన రూ.50వేలు, కేతినేని చిన్నా రూ.50వేలు, కంచర్ల సుధాకర్ రూ.2లక్షలు, కంచర్ల శ్రీకాంత్ రూ.లక్ష, టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్ రూ.50వేలు, కందుకూరు మాజీ ఎంఎల్‌ఎ పోతుల రామారావు రూ.50వేలు, పి.సుధాకర్ రూ.50వేలు, రాము రూ.50వేలు ఒక్కో కుటుంబానికి ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోడీ మృతుల ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు ప్రకటించారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం తరపున మృతుల ఒక్కో కుటుంబానికి రూ.2లక్షలు, గాయపడిన వారికి రూ.50వేలు ప్రకటించారు. చంద్రబాబు వెంట టిడిపి జిల్లా అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, ఇంటూరి నాగేశ్వరరావు ఉన్నారు.

సైకో సిఎంను తరిమికొట్టండి ..!

❍రాష్ట్రంలో రూ.10లక్షల కోట్లు అప్పులు

❍కావలి బహిరంగ సభలో చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి-కావలి/నెల్లూరు ప్రతినిధి

రాష్ట్రాన్ని సైకో ముఖ్యమంత్రి పరిపాలిస్తున్నాడని రాష్ట్రం నుంచి తరిమికొట్టాలని టిడిపి అధినేత ఎన్.చంద్రబాబు నాయుడు అన్నారు. ఇదేమి ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కావలి నియోజ కవర్గంలో పర్యటించారు. గురువారం ఉదయం నుంచి మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆయన రాత్రి 7.30గంటలకు కావలికి చేరుకున్నారు. టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర, అజీజ్‌లు కావలి జాతీయ రహదారి వద్ద ఆయనకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి రోడ్‌షో నిర్వహించారు. కావలి పట్టణంలోని పొట్టిశ్రీరాముల విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ సైకో సిఎం వల్ల రాష్ట్రం సర్వనాశనమైందన్నారు. రాష్ట్రాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు.కందుకూరులో జరిగిన సంఘటన తనను కలిచివేసిం దన్నారు. టిడిపి నాయకత్వం ఒక్కో కుటుం బానికి రూ25లక్షలు సాయం చేసిం దన్నారు. ప్రధాని నరేంద్రమోడీ రూ.2లక్షలు సాయం చేశారన్నారు. అప్పటి వరకూ జగన్ స్పందించలేదన్నారు. కందుకూరు సంఘటనపై పోలీసు అధికారులు మాట్లాడడం సరైన పద్ధతి కాదన్నారు. సైకో సిఎం ఆదేశాలతో డిఐజి, ఎస్‌పి తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. సైకో సిఎం మాటవిని పోలీసులు అతిగా వ్యవహరిస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు 3.50లక్షల కోట్లు రాష్ట్ర అభివృద్ధి కోసం అప్పులు చేస్తే జగన్మోహన్‌రెడ్డి ఇప్పటి వరకూ 10లక్షల కోట్లు అప్పులు చేశారన్నారు.రాష్ట్రంలో ఏ ఒక్క వర్గం ప్రశాంతంగా లేదన్నారు. వైసిపి ప్రభుత్వం వల్ల ఇబ్బందులు పడుతున్నారన్నారు. నిత్యావసర వస్తువుల నుంచి ప్రతి ఒక్కదానిని ధరలు పెంచి పేదలకు అందుబాటులో లేకుండా చేశారన్నారు. రాష్ట్రం మళ్లీ గాడిలో పడాలంటే సైకో సిఎం పోయి సైకిల్ రావాలన్నారు. కావలి ఎంఎల్‌ఎ రౌడీయిజం, దౌర్జన్యం ఎక్కువైందన్నారు. అతని కారణంగా అనేకమంది దళితులు నియోజకవర్గంలో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎంఎల్‌ఎ ఆగడాలు అడ్డుకుంటామని హెచ్చరిం చారు. రాష్ట్రంలో మద్యం, గంజాయికి కేంద్రంగా మారిం దన్నారు. యువత పెడదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంజాయికి బానిసలైతే యువతకు భవిష్యత్తే ఉండదన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు, నాయకులు పి.శ్రీనివాసులరెడ్డి, పనబాక లక్ష్మీ, పనబాక కృష్ణయ్య, బొల్లినేని రామారావు, పాశం సునీల్‌కుమార్, కురుగొండ్ల రామకృష్ణ పాల్గొన్నారు.

విధులు బహిష్కరణ

నెల్లూరు :కార్పొరేషన్‌లో కాంట్రాక్టర్ కింద పనిచేస్తున్న చెత్త వాహనాల డ్రైవర్లు పెండింగ్‌లో ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గురువారం విధులు బహిష్కరించారు. కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూని యన్

(సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నగర గౌరవాధ్యక్షులు కత్తి శ్రీనివాసులు మాట్లాడారు. 200కు పైగా చెత్త వాహనాల డ్రైవర్లు ఉన్నారన్నారు. వారిలో 150 మందికి 18,500/- జీతం ఇస్తుండగా మిగతా 50 మందికి 8250/- ఇస్తున్నారన్నారు. నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వకుండా కార్పొరేషన్ అధికారులు బకాయిలు పెట్టి ఉన్నార న్నారు. సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెర కుమార్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సిఐటియు రూరల్ కార్యదర్శి వర్గ సభ్యులు డి.సంపత్ కుమార్, మున్సిపల్ వర్కర్స్ యూని యన్ నగర కార్యదర్శి ఎం అశోక్, నాయకులు వెంకటేశ్వర్లు, పవన్ పాల్గొన్నారు.

'కృష్ణ చైతన్య' విద్యా సంస్థల ఆర్థిక చేయూత

ప్రజాశక్తి -నెల్లూరు :నగరంలోని స్టోన్‌హౌస్‌పేట కృష్ణచైతన్య జూనియర్ కళా శాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న తోట పావని అనే విద్యార్థిని కి రెండు కిడ్నీలు పనిచేయక తీవ్ర అనారోగ్యం ఇబ్బంది పడుతోంది. సదరు

విద్యార్థినికి వైద్య ఖర్చుల నిమిత్తం కష్ణచైతన్య విద్యాసంస్థలు తరుపున రూ. 3.5 లక్షలు కళాశాల డైరెక్టర్లు శ్రీ ఆర్.వి.కష్ణా రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి అందజేయనున్నారు. జూనియర్ కాలేజ్ డీన్ శిరీష్ బాబు, అకడమిక్ డీన్ రాంగోపాల్ రెడ్డి, డిగ్రీ కాలేజ్ డీన్ సుధారాణి, డిగ్రీకాలేజ్ ప్రిన్సిపాల్ నాగయ్య పాల్గొన్నారు

వాలీబాల్ పోటీలలో ద్వితీయ స్థానం

ప్రజాశక్తి -ఉలవపాడు :ఈ నెల 26, 27, 28 తేదీల్లో విశాఖపట్నం ఎస్‌జిఎ ఆధ్వర్యంలో అండర్-19 వాలీబాల్ పోటీలలో రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానం సంపాదించిన ప్రకాశం జిల్లా జట్టుకు ఉలవపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందనలు తెలిపారు.

'వైఎస్‌ఆర్ బీమా' సాయం

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు చంద్రబాబు సభలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన కొండముడుసు పాలెం గ్రామానికి చెందిన కలవకూరి యానాదికి వైఎస్‌ఆర్ బీమా పథకం రూ.5.లక్షలు మంజూరైంది. మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.10000 కందుకూరు మండలం ఎంపిపి భర్త ఇంటూరి మాధవరావు గురువారం అందజేశారు. సచివాలయ సిబ్బంది, ఎస్‌సి కాలనీ వైసిపి నాయకులు కె.మల్లికార్జునరావు, తదితరులు సంతాపం తెలిపారు.:కందుకూరు ఘటన మృతుడు ఉచ్చులూరి పురుషోత్తం మనవడు దివ్యాంగుడైన తిరుపతయ్యను టిడిపి అధినేత చంద్రబాబు పలకరించారు.

ప్రమాద స్థలంలో డిఐజి పరిశీలన

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు టిడిపి సభలో 8 మంది కార్యకర్తలు మృతిచెందిన ఘటనపై ఎస్‌పి విజయరావు స్పందించారు. కందుకూరులో ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చంద్రబాబు సభ నిర్వహించేందుకు అనుమతి తీసుకున్నారని, తాము అనుమతి ఇచ్చిన ప్రాంతం కంటే చంద్రబాబు 46 మీటర్లు ముందుకు వెళ్లిపోయారని వెల్లడించారు. తాము అనుమతిచ్చిన ప్రాంతంలో తొక్కిసలాటకు అవకాశం ఉండేది కాదన్నారు.చంద్రబాబు ఇరుకుగా ఉన్న రోడ్డులోకి వెళ్లడంతో విపరీతమైన రద్దీ ఏర్పడిందని ఎస్పీ వివరించారు. జనం ఒక్కసారిగా నెట్టుకుంటూ రావడంతో తొక్కిసలాట జరిగిందని తెలిపారు. ఈ ఘటనలో పిచ్చయ్య అనే వ్యక్తి గాయపడ్డాడని, అతడి ఫిర్యాదు ఆధారంగా 174 .పిఆర్‌సి కింద పోలీసులు కేసు నమోదు చేశారని ఎస్‌పి విజయరావు వెల్లడించారు. సమగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు.

45 ఏళ్ల రాజకీయ జీవితంలో

ఇలాంటి విషాధకర సంఘటన చూడలేదు..

టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడు

ప్రజాశక్తి -కందుకూరు :45 ఏళ్ల రాజకీయ జీవితంలో కందుకూరులో జరిగిన లాంటి దుర్ఘటన తాను ఎప్పుడూ చూడలేదని టిడిపిఅధినేత నారా చంద్రబాబు నాయుడు చెప్పారు. గురువారం కందుకూరు తొక్కిసలాటలో మరణించిన వారి మతదేహాల వద్దకు చంద్రబాబు వెళ్లి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా విలేకరులతో చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ తన రాజకీయ జీవితంలో రోడ్డు షో లో ఎనిమిది మంది మృతిచెందడం బాధ కలిగించిందన్నారు. రోడ్డు షోలు ప్రవేశపెట్టిందే తమ నాయకుడు నందమూరి తారకరామారావు అని చెప్పారు. తనతో పాటు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డిలు పాదయాత్రలు చేశారని, ఎక్కడ ఎలాంటి దుర్ఘటనలు చోటు చేసుకోలేదన్నారు. కందుకూరులో జరిగిన విషాదం పూడ్చలేనిదన్నారు. ఆ కుటుంబ సభ్యులకు సంపూర్ణ అండగా టిడిపి ఉంటుందని చంద్రబాబు నాయుడు చెప్పారు. సభ ఏర్పాట్ల వైఫల్యం వల్లనే 8 మంది మరణించడానికి కారణమైందని విలేకరుల అడగగా విమర్శలు చేయడం మంచిది కాదన్నారు. ఏర్పాట్లు సక్రమంగానే జరిగినా పోలీసు వైఫల్యం కొట్టొచ్చినట్లు కనపడిందన్నారు. భద్రతా ఏర్పాట్లలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని, ఇంత పెద్ద సభ జరుగుతుంటే వంద మంది పోలీసులు కూడా ఇక్కడ కనిపించలేదన్నారు. తొక్కేసలాట జరిగి ప్రజలు అస్వస్థతకు గురైతే వారిని తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు తీసుకువెళ్లి ఆసుపత్రుల్లో చేర్చారే తప్ప ఒక్క పోలీసు ఉద్యోగి కూడా రాలేదని చెప్పారు. తమ ప్రభుత్వ హయాంలో జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర చేస్తే అన్ని భద్రతా ఏర్పాట్లను తాము చేశామని చెప్పారు. తమ కార్యకర్తలు చనిపోయి తాము బాధలో ఉంటే కొందరు వ్యక్తులు చౌకబారు విమర్శలు చేయడం తగదన్నారు.

టిడిపి నాయకులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కందుకూరు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి ఇంటూరి నాగేశ్వరరావు, టిడిపి నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షులు ఇంటూరి రాజేష్, మాజీ ఎమ్మెల్యే దివి శివరాం పాల్గొన్నారు.

ఉలవపాడు :ఉలవపాడు మండలం, వరిగచేను సంఘంలో టిడిపి కార్యకర్త యాకసిరి విజయ భౌతికకాయనికి నారా చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చినవారిలో ఇంటూరి నాగేశ్వరరావు, ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, ఇతర సీనియర్ నాయకులు ఉన్నారు.

తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి -కందుకూరు :కందుకూరు చంద్రబాబు నాయుడు సభలో జరిగిన తొక్కిసలాట కారణంగా మృతిచెందినవారి కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. బుధవారం సిపిఎం బందం మృతిచెందిన వ్యక్తుల ఇళ్లకు వెళ్లి మతదేహాలకు నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిపిఎం రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు జాల అంజయ్య మాట్లాడుతూ మృతిచెందిన కుటుంబంలో పిల్లల చదువుల బాధ్యతతో పాటు అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన 2లక్షల ఎక్స్గ్రేషియా ఏమాత్రం చాలదని దానిని 5లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఉలవపాడు మండలం వరిగచేను సంఘ ంకు చెందిన వేటగిరి విజయ నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన వ్యక్తి అని, ఆమెకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారని, వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. సభ ఏర్పాట్ల విషయంలో పోలీసులు, ఇంటెలిజెన్సీ అధికారుల వైఫల్యం స్పష్టంగా ఉందన్నారు.ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి పోలీసులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఒక పక్కన ఫ్లెక్సీలు నిషేధిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఆచరణలో అది అమలు జరగకపోవడం వల్ల ఇటువంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. మరణించిన కందుకూరు పట్టణానికి చెందిన కాకుమాని రాజా, కొండముడు పాలెం గ్రామానికి చెందిన కలవకురి యానాది ,గుడ్లూరు మండలం గుండ్లపాలెం గ్రామానికి చెందిన ఉచ్చులూరి పురుషోత్తం, అమ్మవారిపాలెం గ్రామానికి చెందిన చిన్న కొండయ్య ,ఉలవపాడు మండలం ఆత్మకూరు గ్రామానికి చెందిన దేవినేని రవిచంద్ర, వరిగచేనుసంఘానికి చెందిన వేటగిరి విజయ, కందుకూరు మండలం ఓగురు గ్రామానికి చెందిన గడ్డం మధు కుటుంబాలను సిపిఎం నాయకులు జాల అంజయ్యతో పాటు సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ డి హనీఫ్, సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, సిపిఎం కందుకూరు పట్టణ కార్యదర్శి ఎస్‌ఎ గౌస్, సిపిఎం నాయకులు జాలయ్య పరామర్శించారు

ఉలవపాడు : కందుకూరు ఘటనలో కుటుంబ సభ్యులను కోల్పోయినవారు ధైర్యంగా ఉండాలని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు జాలా అంజయ్య, సిపిఎం ప్రకాశం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ కందుకూరు మతుల కుటుంబాలకు భరోసా ఇచ్చారు. టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు బుధవారం రాత్రి కందుకూరు పర్యటన సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి భౌతికకాయాలకు సిపిఎం నాయకులు గురువారం నివాళులర్పించారు. మండలం ఆత్మకూరులో దేవినేని రవీంద్రబాబు, వరిగచేను సంఘంలో యాటగిరి విజయ నివాసాలకు వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పరామర్శించినవారిలో సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, ప్రజాశక్తి నెల్లూరు జిల్లా బాధ్యులు కె కోటేశ్వరరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ ఏ గౌస్ బాషా, దేవినేని పూర్ణచంద్రరావు ఉన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం సంతాపం

కందుకూరు తొక్కిసలాటలో చనిపోయిన 8మంది మతికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి జి.వెంకటేశ్వర్లు సంతాపం వ్యక్తం చేశారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

తొక్కిసలాటలో మృతిచెందినవారి మృతదేహాలకు నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

కాంగ్రెస్ నాయకుల పరామర్శ

చంద్రబాబు సభలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన వారి కుటుంబాలను కాంగ్రెస్ అధికార ప్రతినిధి షేక్ సైదా ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బందం కందుకూరు పట్టణంలో పర్యటించింది. దుర్ఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించింది. మతుల ఇళ్లకు వెళ్లి వారి భౌతిక కాయాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి షేక్ సైదా మాట్లాడుతూ ఇలాంటి ఘటన జరగటం దురదష్టకరమని ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కావలి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చింతల వెంకటరావు ఉన్నారు.

వైసిపి నాయకుల సంతాపం

కందుకూరులో జరిగిన ఇదేం ఖర్మ కార్యక్రమంలో ప్రాణాలు కోల్పోయిన వారికి కందుకూరు వైసిపి నాయకులు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేసారు. ఈఘటన అత్యంత విషాదాన్ని కలిగించిందని, విలువైన కుటుంబసభ్యులను కోల్పోయిన కుటుంబాలకు ఓదార్పు చేకూరాలనీ ఆకాంక్షించారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు.రావులకొల్లు బ్రహ్మానందం, గంగవరపు.వెంకట్రావు, ఆవుల మాధవరావు ,వి.కొండారెడ్డి, ముప్పవరపు కిషోర్, పెంచెల రెడ్డి, చనమాల కోటేశ్వరరావు, ఇంటూరి మాధవరావు పాల్గొన్నారు. .

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

కార్మికవర్గంపై కేంద్రం దాడి

సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్‌కుమార్

ప్రజాశక్తి-నెల్లూరు :కార్మిక చట్టాలను లేబర్ కోడ్‌గా మార్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికవర్గంపై దాడికి పాల్పడు తున్నాయని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి అజయ్‌కుమార్ విమర్శించారు. జనవరి 2,3,4 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరగనున్న సిఐటియు 16వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కుప్పంలో చేపట్టిన 'కార్మిక చైతన్య యాత్ర' జాతా గురువారం నగరానికి చేరుకుంది.ఈ జాతాకు సిఐటియు శ్రేణులు వెంకటేశ్వరపురంవద్ద ఘన స్వాగతం పలికారు. ఆక్కడ నుంచి నగరంలోని నర్తకీ సెంటర్ వరకు భారీ ప్రదర్శనగా చేరుకుంది. నర్తకీ సెంటర్‌లో బహిరంగ సభ జరిగింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు టివివి ప్రసాద్ అధ్యక్షత వహించారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ్‌కుమార్‌తోపాటు సిఐటియు రాష్ట్ర నాయకురాలు రమాదేవి సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.అజయ్‌కుమార్ , అధ్యక్షులు టివివి ప్రసాద్ ,సిఐటియు నగర కార్యదర్శి జి.నాగేశ్వరరావు మాట్లాడారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రెహెనాబేగం, సిఐటియు రూరల్ కార్యదర్శి కిన్నెరకుమార్ భవన నిర్మాణ రంగం కార్మికులు, ఆటో, ఆర్‌టిసి రవాణా రంగం కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంపద వృద్ధికి చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి - నెల్లూరు :జిల్లాలో మత్స్యసందపను వద్ధి చేసేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టడం తోపాటు మార్కెటింగ్ సదు పాయాలపై ప్రత్యేక దృష్టిసారిం చాలని కలెక్టర్ చక్రధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ చక్రధర్ బాబు

అధ్యక్షతన ప్రధాన మంత్రి మత్స్య యోజన పథకం పై జిల్లా స్థాయి అమలు కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాల ద్వారా జిల్లాలో మత్స్య సంపదను వృద్ధి చేయడంతో పాటు మత్స్యకారుల ఆర్థికా భివద్ధికి కషి చేయాలని సంబంధిత అది. కారులను ఆదేశించారు. మత్స్య శాఖ జెడి నాగేశ్వర రావు, జెడ్‌పి సిఇఒ చిరంజీవి, డి ఆర్ డిఎ పిడి సాంబ శివారెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుధాకర్ రాజు, జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిఇఒ శంకర బాబు, ఎల్.డి.ఎం శ్రీకాంత్ ప్రదీప్ కుమార్ ఉన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

పింఛన్లు రద్దు చేయడం దారుణం

నేడు కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి నెల్లూరు : మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 5వేల మందికి 'మీ పింఛన్లను ఎందుకు రద్దు చేయకూడో చెప్పండి అంటూ కార్పొరేషన్ కమిషనర్ పేరుతో నోటీసులు జారీ చేయడం దుర్మార్గమని సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం నగరంలోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేషన్ అధికారులు తీసుకున్న నిర్ణయం వల్ల నోటీసులు తీసుకున్న పెన్షన్ దారులు తీవ్రమైన మానసిక సభకు గురవుతు న్నారన్నారు. ఏళ్లతరబడి నుంచి తీసుకుంటున్న పింఛన్లను రద్దు చేయాలనుకోవడం దుర్మార్గమన్నారు. నేడు సిపిఎం ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాల యం ఎదుట పెన్షన్లను కోల్పోయిన లబ్ధిదారులతో కలిసి ధర్నా కార్యక్రమం చేపట్ట నున్నట్లు తెలిపారు. సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు జి నాగేశ్వరావు మాట్లాడుతు ప్రభుత్వ చర్యలతో పెన్షన్ ఆధారంగా జీవిస్తున్న అనేక మంది పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకులు పి. సూర్య నారాయణ, షేక్ మస్తాన్ బీ, ఆర్. శ్రీనివాసులు, కత్తి పద్మ, సుబ్బమ్మ, రషీద్, ఫయాజ్, నక్కా వెంకటేశ్వర్లు, అమాన్, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

ఖ్యాతి చాటిన కృష్ణపట్నం పోర్టు

భారీ ఇనుప ఖనిజం లోడుతో చైనా బయల్దేరిన నౌక

ప్రజాశక్తి -నెల్లూరు :ఎంవి.ఎన్.ఎస్. హైరున్ గురువారం తెల్లవారు జామున విజయ వంతంగా కష్ణపట్నం ఓడరేవు పరిమితుల నుంచి చైనాకు బయలు దేరింది. ఆ క్షణం కష్ణపట్నం ఓడరేవు రికార్డులలోనే కాకుండా భారతదేశ సముద్ర చరిత్రలో సువర్ణాక్షరాలతో చరిత్ర తిరగరాసినట్లయిందని పోర్టు వర్గాలు తెలిపాయి భారతీయ సముద్ర పరిశ్రమలో మొట్ట మొదటి సారిగా గరిష్టంగా 17.85 మీటర్ల డ్రాఫ్ట్ పూర్తిగా లోడ్ చేయబడిన కేప్ సైజర్ షిప్ 168100 ఎమ్‌టి టన్నుల ఇనుప ఖనిజాన్ని లోడ్ చేసిన తర్వాత బయలుదేరింది.

ఐరన్‌తో చైనా బయలుదేరిన నౌక

ఇది భారతీయ ఓడరేవుల నుంచి ఇప్పటివరకు ప్రయాణించిన అత్యంత లోతైన డ్రాఫ్ట్.

అరుదైన ఘనత

కష్ణపట్నం ఓడరేవు సూపర్ ఎఫెక్టివ్ టీమ్‌కు బోలెడంత ప్రశంసలు పుష్కలంగా ఉన్నాయి. కొత్త శిఖరాలను చేరుకోవడానికి అద్భుతమైన నిబద్ధత ఫలితాలను చూపించింది. కష్ణపట్నం ఓడరేవు బందం కషి , అంకితభావం గురించి ప్రత్యేకంగా చెప్పాలి. ఎం.వి. ఎన్.ఎస్ హైరున్ 23 డిసెంబర్ 2022 ఓడ సురక్షిత బెర్త్ కోసం ప్రణాళికను రూపొందించారు. తర్వాత 17.85 మీటర్స్, డ్రాఫ్ట్ , 168100 ఎమ్‌టి ఐరన్ ఓర్ లోడుతో ప్రయాణించిన తర్వాత బెర్త్ చేశారు. ఈ ప్రణాళికను మెరైన్ బందం విజయవంతంగా అమలు చేసింది. ఎన్‌పి కెప్టెన్. పాధి , కెప్టెన్ బిభూపాద సాహూ నిపుణుల మార్గదర్శకత్వంలో పోర్టు సిఇఒ జిజె రావు, సిఒఒ సంజోయ్ కోథా తదితరులు నిబద్ధతతో వ్యవహరించారు. ఈ ల్యాండ్ మార్క్ కష్ణపట్నం ఓడరేవు ఖ్యాతిని జాతీయ స్థాయిలో పెంచింది. మొదటి భారతీయ ఓడరేవుగా అత్యున్నత స్థాయికి చేర్చింది.

పాఠశాలను సందర్శించిన ఎంఇఒ

ప్రజాశక్తి-ఉదయగిరి: సర్వరాబాద్ ప్రాథమిక పాఠశాలను మండల విద్యాశాఖ అధికారి షేక్ మస్తాన్ వల్లి సందర్శించారు. గురువారం మండల పరిధిలోని సర్వరాబాదు, గన్నేపల్లి మండల పరిషత్ పాఠశాలలను ఎంఇఒ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డుల పరిశీలన మధ్యాహ్న భోజన రికార్డులను తనిఖీ చేశారు. పాఠశాల సిబ్బంది విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం పాఠశాల టాయిలెట్స్ పరిశుభ్రతను పరిశీలించి తగు సూచనలు చేశారు. పాఠశాల విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్మార్ట్ టీవీ వినియోగం గురించి సమీక్షించి పాఠశాల తరగదులు పాఠశాల పరిశుభ్రతను పరిశీలించారు. నాడు-నేడు రెండవ విడతలో భాగంగా అంగన్వాడీ కేంద్రం పనుల నాణ్యతను పరిశీలించి నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులను పూర్తి చేయాలని నిర్వాహలకు పలు సూచనలు చేశారు. అనంతరం గడ్డం వారి పల్లి జిల్లా ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌ల పై అవగాహన కల్పించారు. ఉన్నత శిఖరాలు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు గడ్డం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు షేక్ నస్రుల్లా, ఆయా నాగరాణి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంఇఒ ఎస్‌కె మస్తాన్‌వలీ

విద్యార్థులు హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: యువత రోడ్డు ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎఎస్ ఆర్ కళాశాలలో రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు రోడ్డుపై ప్రయాణం చేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించారు. ప్రయాణం చేసే సమయంలో హెల్మెట్ తప్పనిసరిగా వాడాలన్నారు. లైసెన్స్ ఎంతమంది విద్యార్థులకు కావాలన్నా తాము ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని విద్యార్థులకు సూచించారు. కార్యక్ర మంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాసులు రెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

గీతాంజలిలో రంగవల్లుల పోటీలు

ప్రజాశక్తి-కోవూరు: జిల్లాలోని ప్రముఖ ఇంజినీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీలో బుధవారం చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో ధనుర్మాసం సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వ హించారు. ఈ పోటీల్లో ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ కుమార్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల వలన విద్యా ర్థులకు మానసిక ఉల్లాసంతో పాటు వారిలో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంద న్నారు. అనంతరం ఈ పోటీలో గెలుపొందిన విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఈ పోటీలకు సహకారం అందించిన డి.కుమారస్వామి రెడ్డిని కళాశాల కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి ప్రత్యేకంగా అభి నందించారు. కార్యక్రమంలో ఎ.రామ్ ప్రసాద్, డి.శ్రీనివాసరావు, కె.మోహన్ రెడ్డి, ఎ.పద్మజారాణి, డి.లీలావతి, కె.లక్ష్మి ముఖ్య అతిథులుగా వ్యవహరించారు.కార్యక్రమంలో సమన్వయకర్తగా డాక్టర్ టి.రవికుమార్, అధ్యాపకులు ఉన్నారు.

చంద్రబాబునాయుడు సభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-కోవూరు: నేడు జరగబోయే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోవూరు పర్యటనను విజయవంతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చిన పొలం రెడ్డి దినేష్ రెడ్డి ఈ సందర్భంగా కోవూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దినేష్ రెడ్డి మాట్లాడుతూ నేడు జరగబోయే చంద్రబాబు నాయుడు పర్యటనలో పాల్గొనే ప్రతి నాయకుడు కార్యకర్తలు కారులో స్కూటర్లో వచ్చేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకొని రావాలని బహిరంగ సభలో అప్రమత్తంగా ఉండే విధంగా జాగ్రత్తలు చేపట్టాలని కార్యకర్తలకు నాయకులకు ఆయన సూచనలు సలహా అందించారు. బుచ్చిరెడ్డిపాలెం, ఇందుకూరుపేట, విడవలూరు, కొడవలూరు టిడిపి నాయకులు కార్యకర్తలు చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో పాల్గొనేందుకు పెద్ద ఎత్తున నాయకులు కదిలి రావాలని వచ్చేటప్పుడు జాగ్రత్తలు పాటించి రావాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు రోడ్‌షోకు బయల్దేరిన నాయకులు

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: కావలి లో జరుగుతున్న చంద్రబాబు పర్యటన ఇదేమి ఖర్మ రాష్ట్రానికి కార్యక్రమానికి మండలానికి చెందిన పలువురు టిడిపి నేతలు ప్రత్యేక వాహనంలో బయలుదేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు నాయకత్వంలో టిడిపిను మరోసారి అధికారంలోకి తేవడానికి తామంతా శక్తి వంచన కషి చేస్తామని వారన్నారు. భారీ సంఖ్యలో ప్రజలు టిడిపి నాయకులు పాల్గొన్న కందుకూరు సభలో జరిగిన ఘటన దురదష్టకరమన్నారు కావలికి బయలుదేరిన టిడిపి నేతలలో ఏఎస్ పేట బిట్2 ఎంపిటిసి షేక్ అబ్జల్, డాక్టర్ ఖాజా మియా, కష్ణారెడ్డి, కంచర్ల శ్రీధర్ నాయుడు, ఎంబిటి బాబు, ఎస్దాని భాష , సద్దాం, షాను, షఫీ, ఇతర నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

విజ్ఞాన కేంద్రంలో పరిశీలన

ప్రజాశక్తి-దగదర్తి: మండలంలో నూతనంగా నిర్మించిన జక్కా వెంకయ్య విజ్ఞాన కేంద్రాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. అనంతరం విజ్ఞాన కేంద్రంలో పార్టీ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి కర్ర పోలయ్య అధ్యక్షుడుగా వివరించారు. ఇటీవల దళితులపై దాడి జరిగిందని తెలుసుకున్న ఆయన వెంటనే పార్టీ నాయకులను అడిగి తెలుసుకున్నారు. దీనిపై పార్టీ నాయకులు స్పందించి ఉప్పలపాడు గ్రామానికి చెందిన తలారి రవి పై ఎస్ఐ దాడి చేయడంతో పాటు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ వారు ఆయన దష్టికి తీసుకుని వచ్చారు. ఈ విషయమై ఆయన మాట్లాడుతూ దళితులకు న్యాయం చేయాల్సిన దళిత ఎస్ఐ ధనవంతులకు వెనకేసుకుని రావడం దారుణమని వారన్నారు. ఇట్లాంటి ఘటనలు పునరావతం కాకుండా పార్టీ నాయకులు కలిసికట్టుగా ఉండి సమస్యలపై పోరాడాలని సూచించారు. అవసరమైతే ఉద్యమాలు చేపడతామని సూచించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జొన్న గడ్డల వెంకమరాజు, జన విజ్ఞాన వేదిక నాయకులు రాము, విద్యాచరణ్, సిపిఎం మండల నాయకులు, వంటేరు సుధాకర్, మంద మహేష్, ఎస్‌కె కాలేషా, రైతు సంఘం నాయకులు గోపుసాని రమేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే లక్ష్యం

ప్రజాశక్తి-ఉదయగిరి: ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో వాలంటరీల రథసారథులని ఎంఎల్‌ఎ మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సచివాలయ కన్వీనర్ల వలంటరీల సమావేశానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ అభివద్ధికి ఆదర్శానికి నిలువెత్తు నిరూపానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా అభివద్ధి పథంలో పాలన సాగిస్తూ ప్రజలకు అధికారులకు అతి దగ్గరలో వారధిల వాలంటరీ వ్యవస్థను నియమించి ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలను వాలంటీర్ల సామాజిక ప్రజానాకానికి అందుబాటులో ఉంచడం ఎంతో గొప్ప ఆలోచనను తీసుకువచ్చిన ముఖ్యమంత్రి కి ధన్య వాదాలు తెలిపారు. మండల కన్వీనర్ అక్కి భాస్కర్ రెడ్డి, సర్పంచులు కల్లూరి వెంకటేశ్వర్ రెడ్డి, గౌస్ మొహద్దిన్, ఎంపీటీసీ గొల్లపల్లి తిరుపతయ్య, మాజీ సర్పంచులు మూలే.సుబ్బారెడ్డి, ఓబుల్ రెడ్డి, నాయకులు శ్రీనివాసులు రెడ్డి, ఉప సర్పంచ్ ముర్తుజా, జిల్లా వాక్స్ బోర్డ్ డైరెక్టర్ గడియాల్సి ఎస్దాని, కష్ణారెడ్డి పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నివాళులు

ప్రజాశక్తి-రాపూరు: వెంకటగిరి మాజీ శాసనసభ్యులు కురుగొండ్ల రామకష్ణ ఆదేశాల మేరకు నిన్న కందు కందు కూరులో మృతిచెందిన వారి కుటుంబాలకు టిడిపి నాయకులు నివాళలర్పించారు.కార్యక్రమంలో వెంకటేశ్వర్ రెడ్డి, నువ్వుల శివరామకష్ణ, మండల నాయకులు పాల్గొన్నారు.

'వైసిపి నేతల్లారా లెక్క చూసుకోండి'

ప్రజాశక్తి-అల్లూరు
తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు గురువారం కావలికి విచ్చేస్తున్నడంతో మండలాలకి చెందిన కార్యకర్తలు సుమారు 7 వందల వాహనాలలో భారీగా తరలి వెళ్లారు. అల్లూరు గోదాముల వద్ద నుంచి పార్టీ శ్రేణులు ర్యాలీ చేపట్టారు. సుమారు మూడు కిలో మీటర్ల మేరకు వాహనాలు వాహనాల రద్దీ కొనసాగింది. సుమారు గంటసేపు ట్రాఫిక్‌కి తీవ్ర అంతరాయం ఏర్పడింది.కొద్ది సంవత్సరాల నుండి ఆ పార్టీ స్తబ్దుగా ఉన్న తరుణంలో పూర్తిగా ఉనికిని కోల్పోయారంటూ పుకార్లు వచ్చాయి. బీద రవిచంద్ర నాయకత్వంలో జన సమీకరణతో టిడిపికి పూర్వ వైభవం వచ్చిందని పలువురు అంటున్నారు. ఈ సందర్భంగా గూడూరు మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ మండలం నుంచి 6,500 మంది కార్యకర్తలు తరలి వెళుతున్నారని హర్షం వ్యక్తం చేశారు. ముందుగా కందుకూరులో మతి చెందిన టిడిపి కార్యకర్తల కోసం మౌనం పాటించారు. మతుల కుటుంబాలను చంద్రబాబు నాయుడు వెళ్లి నేరుగా పరామర్శించారని ఈ దుర్ఘటన చాలా దురదష్టకరమైన విచారం వ్యక్తం చేశారు. కొంతమంది అధికార పార్టీ నేతలు తెలుగుదేశంపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రవిచంద్ర నాయకత్వంలో తామంతా పని చేస్తున్నట్లు వివరించారు. తెలుగుదేశం పార్టీ నాయకులు బీద గిరిధర్ మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం జరిగిన పూజా కార్యక్రమాల్లో తెలుగుదేశం పార్టీ పూర్తిగా నిర్వీర్యమైందని ప్రగల్బాలు పలికారన్నారు .జన సమీకరణతో మా బలం ఏమిటో నిరూపించామన్నారు. అధికార పార్టీ నేతలు బెదిరింపులకు పాల్పడ్డ చంద్రబాబు పర్యటనకు ప్రజలు కదం తొక్కి అభిమానాన్ని చాటుకున్నారని వివరించారు.

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్‌ఎ పాశం

రానున్న ఎన్నికల్లో పోటీకి సిద్ధం

ప్రజాశక్తి-సీతారామపురం: రానున్న 2024 అసెంబ్లీ ఎన్నికలలో వైసిపి అధిష్ఠానం ఆదేశిస్తే ఉదయగిరి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఉదయగిరి మాజీ ఎంపీపీ, చేజర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత చేజర్ల సుబ్బారెడ్డి పేర్కొన్నారు. గురువారం సీతారామపు రంలోని బిట్-1 ఎంపిటిసి పిసి అల్లూరు రాజు నివాసంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. వైసిపి ఆవిర్భావం నుండి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలను అనుసరిస్తూ పార్టీ కోసం నిరంతరం కష్టపడ్డామన్నారు. అదే విధంగా 2014లో టిడిపి ప్రభుత్వం అధికారంలో తమను ఎన్నో ఇబ్బందులకు గురిచేసినప్పటికీ ఉదయగిరి ఎంపీపీగా పార్టీ పటిష్టతకు కషి చేస్తూ కార్యకర్తలకు అండగా ఉన్నామన్నారు. అప్పటి అధికారులు పోలీసులు తమపై కక్ష సాధింపు చర్యలు చేసినా ధైర్యంగా నిలబడుతూ కార్యకర్తల ను కాపాడుకుంటూ పార్టీని బతికించుకున్నామన్నారు. 2019 ఎన్నికలలో వైసిపి అధికారంలోకి రావడానికి శాయశక్తుల కషి చేశామన్నారు. అధికా రంలో ఉన్నామనే కానీ కార్యకర్తలకు ఎటువంటి న్యాయం చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. శాసనసభ్యుడు కొంత వర్గానికి మాత్రమే ప్రాధాన్యతనిస్తూ తమను ఇబ్బందులకు గురు చేస్తున్నార న్నారు. నియోజకవర్గంలోని ప్రతి మండలంలో గ్రూపులను ప్రోత్సహిస్తూ నిజమైన వైసిపి కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే నియోజకవర్గంలో ఇలాంటి స్వార్థ రాజకీయాల వల్ల వైసిపి నాశనమైపోయిం దన్నారు. అధిష్టానం వెంటనే ప్రక్షాళన చర్యలు తీసుకొని నియోజకవర్గానికి ఇన్చార్జిని ప్రకటిస్తే పార్టీ బలోపేతమయ్యే అవకాశం ఉండి రానున్న ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గం నుండి వైసీపీ గెలిచే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను అధిష్టానం ప్రకటించిన వెంటనే నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరిని కలుపుకొని పోతూ సీతారామపురం నుంచి జలదంకి వరకు పాదయాత్ర నిర్వహిస్తానని తెలిపారు. అనంతరం ఎంపీటీసీ అల్లూరు రాజు మాట్లాడుతూ అసలైన మండల పార్టీ కన్వీనర్ ఎవరో తేల్చాల్సిన బాధ్యత ఎమ్మెల్యే పై ఉందన్నారు. మండల కన్వీనర్ గా బీసీలకు చెందిన దుర్గయ్య లాంటి చదువు కున్న యువకులకు అవకాశం కల్పిస్తే మండలంలో పార్టీ పూర్వ వైభవం పుంజుకుంటుందని ఆశా భావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉదయగిరి జెడ్‌పిటిసి రామాం జనేయులు, నియోజక వర్గ యువజన ప్రధాన కార్యదర్శి కల్లూరి రాజారెడ్డి, ఉదయగిరి మాజీ ఎంపిటిసి ఉప్పుటూరు హరి, అబ్బిరెడ్డి, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

సంక్షేమ పథకాలేపార్టీకి బలం

ప్రజాశక్తి-కొడవలూరు: రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైసిపికి కొండంత బలమని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. నార్తురాజుపాలెంలోని పార్టీ కార్యాలయంలో కొత్తగా నియమింపబడ్డ సచివాలయ కన్వీనర్లు, గహ సారథులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కన్వీనర్లు, సారథులుగా బాగా సీనియర్లను నియమించామన్నారు. వీరంతా అతి విశ్వాసం (ఓవర్ కాన్ఫిడెన్స్ కు పోకుండా బాధ్యతగా పని చేయాలన్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లు సాధించినప్పటికీ ధీమా మనలో ఉండరాదన్నారు. భారతదేశంలో ఎక్కడా అమలు చేయనన్ని పథకాలు రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్నారన్నారు. వాటిని ప్రజల్లోకి తీసుకుపోవడమే మన లక్ష్యమ న్నారు. కొత్తగా కట్టబెట్టిన పదవులను మొక్కుబడిగా భావించకుండా పార్టీ కోసం వారంలో మూడ్రోజులు కేటాయించి పని చేయాల న్నారు. పార్టీ బాగుంటే మన మంతా బాగుంటా మన్న విషయాన్ని గుర్తించుకో వాలని చెపా , వలంటీర్లు సచివాలయ వ్యవస్థ ఎంతో బాగా పనిచేస్తున్నారన్నారు. వారితో కలసి ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకుపోవా లన్నారు. గడిచిన మూడున్నరేళ్లలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏమాత్రం సంపాదించుకోలేక పోయారన్నారు. ఈ విషయం ముఖ్య మంత్రికి, తనకు తెలుసు నన్నారు. సమావేశంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బాలచంద్రారెడ్డి, రాష్ట్ర కమిటి సభ్యుడు రామ్మోహన్రెడ్డి, మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, నాయకులు ఇసనాక సునీల్ రెడ్డి, మారం రెడ్డి రంగారెడ్డి, పెనాక శ్రీనివాసులురెడ్డి, ఆర్.రాజేష్ రెడ్డి, సర్పంచ్లు బి.సుప్రియ, పెల్లేటి రజినీ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

వ్యవసాయ మంత్రి గోవర్ధన్ రెడ్డి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు
ప్రజల సంక్షేమమే "గడప గడపకు మన ప్రభుత్వం" ముఖ్య లక్ష్యమని వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలో నరుకూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. మాజీ సర్పంచ్ ఆకుల మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నిర్వహిస్తున్న గడప గడప కార్యక్రమాన్ని అన్ని రాజకీయ పార్టీలు ప్రశంసిస్తున్నాయన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకోవడంతోపాటు వాటిని వెంటనే పరిష్కరించే అవకాశం కలుగుతోందని మంత్రి అన్నారు. అంతేకాకుండా ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గోవర్ధన్ రెడ్డి చెప్పారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఇంట ింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో ప్రజలు హర్షిస్తున్నారని మంత్రి తెలిపారు. దీనికి ముందు మంత్రి రైతు భరోసా కేంద్రానికి ప్రారంభోత్సవం చేశారు. గడప గడప కార్యక్రమానికి వచ్చిన మంత్రి గోవర్ధన్ రెడ్డి కి ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు చిల్లకూరు సుధీర్ రెడ్డి, ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, వెలిచర్ల శ్రీనివాసులు, జిల్లా వ్యవసాయాధికారి సుధాకర్ రాజు, ఎంపీడీఓ కన్నం హేమలత, తహశీల్దార్ హమీద్, ఎంఏఓ గీతాకుమారి, ు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

మాట్లాడుతున్న డిఐజి తివిక్ర వర్మ

నిబంధనలు ఉల్లంఘించడంతోనే ప్రమాదం

ప్రజాశక్తి-నెల్లూరు: నియమ నిబంధనలను ఉల్లంఘించడం వల్లనే నెల్లూరు జిల్లా కందుకూరులో ప్రమాదం జరిగి ఎనిమిది మంది మృతి చెందారని డిఐజి తివిక్రమ వర్మ పేర్కొన్నారు. గురువారం నెల్లూరు నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐజి తివిక్రమ వర్మతో కలిసి ఎస్‌పి సిహెచ్ విజయరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ కందుకూరు డిఎస్‌పి ఇచ్చిన రూట్ మ్యాప్ ప్రకారం రోడ్‌షో, బైక్ షో జరగలేదన్నారు. పోలీసుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా క్రాకర్స్ కాల్చార న్నారు. నియమ నిబంధనలకు విరుద్ధంగా బైక్ ర్యాలీ నిర్వహిం చడం ప్రజలు వెళ్లేందుకు వీల్లేకుండా అడ్డంగా నిలిపివే యడం వల్లనే ఈ ప్రమాదం చోటు చేసుకుం దన్నారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం నిర్వహిం చుకునేందుకు అనుకూలంగా ఏ ప్రాంతాన్ని అయితే పోలీసులు గుర్తించి అనుమతి ఇచ్చారా.. ఆ ప్రాంతానికి 46 మీటర్ల దూరం ముందుకు రావడం అదే ప్రాంతంలో వాహనాలు నిలిపివేసి ఉండటం వల్ల ఒక్క సారిగా తొక్కిసలాట ప్రారంభం కావడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందన్నారు. తక్కువ ప్రదేశంలోకి ఎక్కువ మంది ప్రజలు రావడం, మిగిలిన రహదారుల నుంచి ప్రజలు ఇదే వైపునకు రావడంతోఊపిరి ఆడకపోవడం వల్ల స్పృహ కోల్పోయి కిందపడిపోయారన్నారు. ఈ ప్రమాదం జరిగిన వెంటనే ఏవరైతే అపస్మారక స్థితికి చేరుకున్నారో వారందరినీ కేవలం 100 మీటర్ల దూరంలో ఉన్న ఏరియా వైద్యశాలకు చికిత్సల నిమిత్తం తరలించామన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న రహదారులన్నీ వెడల్పు తక్కువగా ఉన్నాయని, పోలీసులు అనుమతి ఇచ్చిన విధంగా ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద ఈ సభా కార్యక్రమం ఏర్పాటు చేసుకొని ఉంటే ఈ ప్రమాదం జరిగి ఉండేది కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు.అంతే కాకుండా ఈ రహదారుల్లో ఫ్లెక్సీలు ఎక్కువగా ఏర్పాటు చేయడం వల్ల ఖాళీ ప్రదేశం తక్కువైపోయిందన్నారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేసేందుకు డిఎస్‌పి స్థాయి అధికారిని నియమించా మన్నారు. అంతే కాకుండా న్యాయనిపుణుల సలహాలు తీసుకొని చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో పోలీసు శాఖ ఉన్నతాధికారులు , కందుకూరు పోలీసు స్టేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఆనం విమర్శలపై వైసిపి ఖండన

ప్రజాశక్తి-రాపూరు: తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి ఆదేశాలు మేరకు వైసిపి మండల నాయకులు దందోలు నారాయణరెడ్డి, కలపాటి మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ మాజీ మంత్రివర్యులు వెంకటగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే ఆనం రామనాయన్ రెడ్డి 40ఏళ్ళు రాజకీ యాల్లో మేము ఉన్నామని చెప్పుకుంటున్నారు.రాపూరులో ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా చేశారు. రాపూరిని ఏమి ఉద్ధరించారన్నారు.

రాష్ట్ర పిఎంపి కోశాధికారిగా 'శాఖవరపు'

ప్రజాశక్తి-నెల్లూరు : తాడేపల్లిగూడెంలో జరిగిన పిఎంపి 60 వసంతాల వేడుకలలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలలో రాష్ట్ర పీఎంపీ కోశాధికారిగా నెల్లూరు జిల్లా అధ్యక్షులు శాఖవరపు వేణుగోపాల్ ని రెండవ సారి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సందర్భ ంగా గురువారం బుజబుజ నెల్లూరులోని జిల్లా పీఎంపీ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఫిల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ నాగసాయి సూరి పరావస్తు వేణుగోపాల్‌ని ఘనంగా సన్మానించి మాట్లాడుతూ భారతదే శంలో ఈనాటికి గ్రామాల్లో పేద ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు అందుతు న్నాయి అంటే అది పీఎంపీలు వల్లనేన న్నారు. పీఎంపీలు లేని సమాజాన్ని ఎవరు ఊహించలేరన్నారు. గత 60 సంవత్సరాలుగా ప్రజలకు అత్యంత చేరువలో ప్రాథమిక వైద్య సేవలు అందించేది పీఎంపీ లేనని అన్నారు. బడుగు బలహీన వర్గాల పేదలకు ప్రతిచోట పిఎంపిలు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా ఉంటున్న జిల్లా అధ్యక్షుడు శాఖవరపు వేణుగోపాల్ ను రాష్ట్ర పీఎంపీ అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నిక వ్వటం అభినందనీయమన్నారు. వేణు గోపాల్ కు ఎన్నో అవార్డులు, రివార్డులు, సన్మానాలు, సత్కారాలు జరిగిన వని, ఇది గుర్తించిన రాష్ట్ర కమిటీ వారిని కోశాధికారిగా నియమిం చారన్నారు. ఈసందర్భంగా వేణు గోపాల్ ను పీఎంపీలు ఘనంగా సత్క రిం చారు. కార్యక్రమంలో అను ముల జయ ప్రకాష్, షేక్ రసూల్, కె. వెంకటేశ్వర్లు, నూర్జహాన్ బేగం, ఓ.మస్తానయ్య, షేక్.సత్తారు జి.శేష య్య, యన్.ప్రసాదు, జి.పెంచలయ్య, ఎస్.రాము, నాగరాజు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో నమోదైన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు కేత వేణు గోపాల రెడ్డి తెలియజేశారు. గురువారం ఆయన మండలంలోని రామస్వామి పల్లి లో జరిగిన రివ్యూ సమావేశం లో ఆయన మాట్లాడారు. ఆత్మకూరు శాసనసభ్యులు మేకపాటి విక్రమ్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి 2నెలలకు ఒకసారి ఆయా గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సమస్యల పరిష్కారానికై అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సి. శ్రీనివాసులు మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ పట్ల ప్రజలకు మంచి అభిప్రాయం తీసుకొని వచ్చి తద్వారా గ్రామ అభివద్ధికి భాధ్యత గా పనిచేయాలని కోరారు. వలంటీర్లు ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేసి సత్ఫాలితాలను సాధించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రాజేష్, వైసిపి నాయకులు మాల్యాద్రి, వేణు గోపాల రెడ్డి, కార్యదర్శి కార్తిక్, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

రేషన్‌షాపుల్లో తనిఖీ

ప్రజాశక్తి-సంగం: జాదికా ఆమత్ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర ఆదేశాల ప్రకారం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ మందా రాణి జెండా దిబ్బ, అరవపాలెం గ్రామాల్లోని రేషన్ షాపు నెంబర్: 17,29 లను తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో రేషన్ షాపుల పనితీరు, నిత్యావసర సరుకుల నాణ్యత, సరుకులు పంపిణీ పట్ల కార్డుదారులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఎండియు వాహనాల ద్వారా డోర్ టు డోర్ పంపిణీ చేసే నిత్యావసర సరుకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. వీరి వెంట ఐటిడిఎ తహశీల్దార్ రాజ్యలక్ష్మి, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహశీల్దార్ ఐ. రవి, ఆర్ఐ రాజా, నారా యణ, విఆర్ఓ సుధాకర్‌లు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు నివాళులు

ప్రజాశక్తి-వరికుంటపాడు: మాజీ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కందుకూరు పర్యటనలో భాగంగా బుధవారం రోజు జరిగిన రోడ్డు సో తొక్కిసలాటలో మతి చెందిన ఎనిమిది మంది పార్టీ కార్యకర్తలకు గురువారం వరికుంట పాడు మండల తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ చంద్రా మధుసూదన్ రావు ఆధ్వర్యంలో మతి చెందిన వారికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మతి చెందిన కుటుంబాలకు తమ ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఎల్లప్పుడూ ఆ కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ చంద్ర వెంకయ్య, మాజీ సొసైటీ అధ్యక్షులు పావులూరి రవీంద్రబాబు, మండల తెలుగు యువత అధ్యక్షులు ముజ్జె లక్ష్మీనా రాయణ, మండల ప్రధాన కార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్, రావెళ్ల గోపికష్ణ, ఆరోన్, లాబాన్, వెంగయ్య, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పవనన్న ప్రజా బాట

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: పవన్ కళ్యాణ్‌ని ముఖ్యమంత్రి చేయాలన్న దఢ సంకల్పంతో, ప్రజల ఆశీర్వాదంతో కొనసాగుతున్న పవనన్న ప్రజాబాట కార్యక్రమం, 42వ రోజుకు చేరుకుంది.పవనన్న ప్రజా బాట కార్యక్రమంలో భాగంగా ఈరోజు ఆత్మ కూరు మున్సిపల్ పరిధిలోని నాగేంద్రపురం, కంద వీధి, ప్రాంతాలలో పర్యటించి ప్రతి ఇంటికి జనసేన పార్టీ కరపత్రాలను పంచుతూ, జనసేన పార్టీ సిద్ధాంతాలను తెలియజేస్తూ పవనన్న ప్రజా బాట సాగుతుంది. ఈ ప్రాంత ప్రజల ఇబ్బందులను తెలుసుకొని జనసేన పార్టీ తరపున తన వంతు కషి చేస్తానని ఈ సందర్భంగా ఆత్మకూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నలిశెట్టి శ్రీధర్ భరోసా ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో ఆత్మకూరు జనసేన పార్టీ నాయకులు వంశీ, చంద్ర, నాగరాజు, ఆనంద్, భాను, మదన్ అనిల్ ,తిరుమల, హరిబాబు, దొరబాబు, ప్రసాద్, సందీప్, వెంకటేష్, అశోక్, హజరత్ పాల్గొన్నారు.

పేటలో రివ్యూ సమావేశం

ప్రజాశక్తి-ఎఎస్‌పేట: ముఖ్యమంత్రి పేద ప్రజలకు సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ఎటు వంటి ఆర్థిక కష్టాలు వచ్చినా రాజీ పడకుండా అమలు చేస్తున్నారని జెడ్‌పిటిసి సభ్యురాలు పందిళ్ళపల్లి రాజేశ్వరమ్మ తెలిపారు. ఆమె గురువారం స్థానిక సచివాల యంలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం పై రివ్యూ సమావే శానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రభుత్వం ప్రస్తుత ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా ప్రజలకు సకాలంలో వివిధ రకాల సంక్షేమ పథకాలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి ముందంజలో ఉన్నారని తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏఎస్ పేట సచివాలయం బిట్1,2 లకు కలిపి 256 అర్జీలు వచ్చాయని తెలిపారు. వాటిలో 201 పరిష్కరించ బడ్డాయని 55 అర్జీలు పరిశీలనలో ఉన్నాయని త్వరితగతిన వాటిని కూడా పరిష్కరించనున్నట్లు మండల ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి షేక్ యస్దాని బాషా తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. సుభద్ర, సర్పంచ్ షేక్ జిలాని బాషా, బిట్2 ఎంపీటీసీ షేక్ అఫ్జల్, వీఆర్వో మీరావలి, బిట్2 పంచాయతీ కార్యదర్శి వినాయక్ సచివాలయ సిబ్బంది వాలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సెంటర్ ఫర్ ఎడ్యుకేషనల్ డెవలప్మెంట్ ఆఫ్ మైనారిటీస్ పాఠ్యపుస్త కాలను 10వ తరగతి విద్యార్థులకు మైనారిటీ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలను మున్సి పల్ వైస్ చైర్మన్‌లు డాక్టర్ కె వి శ్రావణ్ కుమార్, షేక్ సర్దార్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భగా డాక్టర్ కె.వి శ్రావణ్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువు కోవాలని కోరారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ సర్దార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యార్థుల కోసం ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తుంద న్నారు. అదేవిధంగా విద్యార్థులు లక్ష్యం నెరవేర్చుకొని చదువుకొని మంచి స్థాయిలో ఉండాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ మెంబర్ నాగమణి, ఉపాధ్యా యులు జావీద్, జనార్ధన్, శ్రీనివాసులు ,విద్యార్థులు పాల్గొన్నారు.

నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-నెల్లూరు: పట్టపగలు ఒంటరిగా నడిచి వెళు న్న మహిళల మెడలో చైన్‌స్నాచింగ్ చేస్తూ తప్పించుకొని తిరుగుతున్న ఇద్దరు నిందితులను కోవూరు పోలీసులు అరెస్టు చేశారని ఎస్‌పి సిహెచ్ విజయరావు తెలిపారు. గురువారం నగరంలోని ఉమేష్‌చంద్రా కాన్ఫరెన్స్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ ఈ నెల 7వ తేదిన కోవూరులోని కెఆర్ఆర్ నగర్‌లో ఒక వివాహవేడుకలకు హాజరై తిరిగి ఇంటికి వెళ్తున్న సమయంలో పలనాటి విజయ మెడలోని బంగారు ఆభరణాన్ని లాక్కొని గుర్తు తెలియని వ్యక్తి పారిపోయా డంటూ బాధితులు ఫిర్యాదు చేశార న్నారు. సాలు చింతల సెంటర్‌లో కోవూరు సిఐ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తుండా పారిపోయేం దుకు ఇద్దరు యువకులు ప్రయత్నించా రన్నారు. వారిని వెంబడించి అదుపులోకి తీసుకొని విచారణ చేయగా అసలు విషయం బహిర్గతమైం దన్నారు. తమిళనాడు రాష్ట్రం, చెంగల్పట్టు జిల్లా, మయూర్ గ్రామానికి చెందిన డానియల్ తమిలర్సన్ అలియాస్ డానీ చెన్నయ్ , ఆరంబాకం ప్రాంతానికి చెందిన పాదర్తి వెంకటేశ్వర్లు (39) ఇద్దరు గడిచిన ఏడాది నుంచి కోవూరు, కావలి, నెల్లూరు నగరం ప్రాంతాల్లో తిరుగుతూ ఒంటరిగా నడిచి వెళ్తున్న మహిళలను టార్గెట్ చేసి వారి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను లాక్కొని పారిపోయి జల్సాలు చేస్తూ విలాసవంతమైన జీవితం గడుపు తుండే వారని నిర్ధరణ అయిందన్నారు. నగరంలో పలు ప్రాంతాల్లోని సిసి పుటేజీ పరిశీలించగా ఈ ఇద్దరు మహిళల మెడల్లోని బంగారు ఆభరణాలు లాక్కొని వెళ్ళేవారుగా నిర్ధరణ అయిందన్నారు. నగరంలో వేదాయపాళెం పోలీసు స్టేషన్‌లో ఆరు కేసులు, కావలి పోలీసు స్టేషన్‌లో రెండు కేసులు, కోవూరు పోలీసు స్టేషన్‌లో మూడు కేసులు, చిన్న బజారు పోలీ సు స్టేషన్‌లో ఒక కేసు, సింగరాయకొండ ప్రాంతంలో మోటారు సైకిల్ దొంగతం చేసినట్లు ఒక కేసు నమోదు అయినట్లు గుర్తించామన్నారు. ఈ నిందితులను పట్టుకోవడంలో ప్రతిభను చూపిన కోవూరు, సిసిఎస్ పోలీసు సిబ్బందికి ఐజి తివిక్రమ వర్మ చేతులతో రివార్డులను అందజేశారు.